వైభవంగా హనుమజ్జయంతి


గూడూరు: లక్ష తమలపాకులతో పూజలు చేస్తున్న భక్తులు

గూడూరు: పట్టణంలోని కోనేటిమిట్టలో ఉన్న కోదండరామాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేషాలంకరణ, అభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, లక్ష తమలపాకులతో సామూహిక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

తూర్పువీధిలో..

పట్టణంలోని తూర్పువీధిలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద తమలపాకు పూజ, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు హజరత్‌బాబు, దశరథరామారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కరణాల వీధిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

శ్రీరామరక్ష కుటీరంలో..

రెండో పట్టణంలోని శ్రీరామ రక్ష కుటీరంలో హనుమజ్జయంతి సందర్భంగా స్వామివారికి అష్టోత్తర శత సహస్ర నాగవళీదళ, తమలపాకులతో సామూహిక పూజలు చేశారు.

వీరాంజనేయస్వామి దేవస్థానంలో..

కోట: పట్టణంలోని వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రసాద్‌బాబు స్వామి వారికి చందన అలంకరణ, విశేష అభిషేకాలు చేశారు. పల్లకీ ఉత్సవం వేడుకగా జరిగింది.

చిట్టమూరులో..

చిట్టమూరు: మండలంలోని ఆరూరులో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, విశేషాలంకరణ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: మండలంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కలశ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సామూహిక సహస్రనామార్చన, అష్టోతర నాగవలి (ఆకుపూజ), మంత్ర పుష్పం తదితర ప్రత్యేక పూజలను జరిపారు. రాత్రి హనుమాన్ చాలీసా, పారాయణం అనంతరం స్వామి వారి గ్రామోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.

కుల్లూరులో..

కలువాయి: కుల్లూరులోని ఆరామ మారుతీ నిలయంలో అభయ హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధర్, నళినమ్మ ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉదయం ఆంజనేయస్వామి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం హోమం చేశారు. స్వామి వారికి ఆకుపూజ నిర్వహించారు. ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి అభయ ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం పండరి భజన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సైదాపురంలో..

సైదాపురం: మండల కేంద్రంలోని అంజనేయ స్వామి ఆలయాల్లో ఆదివారం హనుమజ్జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఉదయం సామూహిక మహోకుంభాభిషేకం, పూలంగిసేవ, కలశస్థాపన, మధ్యాహ్నం స్వామివారికి మహానివేధిత పూజలు చేశారు. మండలంలోని తోచాం సమీపంలో ఉన్న సంజీవస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. లక్ష తమలపాకులతో అర్చన చేశారు. ఆలయ చైర్మన్ అయితా శ్రీధర్, ఆలయ ప్రధాన పూజారి దివి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. లక్ష తమలపాకులు అర్చనలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, మీజూరు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయ విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వగరలి, పల్లమాల, కడివేడు, నెలబల్లిరెట్టపల్లి, చిల్లకూరు గ్రామాల్లో అన్నదానం చేశారు.


నాయుడుపేట: అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు


చిట్టమూరు: విశేషాలంకరణలో హనుమంతుడు


కలువాయి: హారతి తీసుకుంటున్న బల్లి కళ్యాణ చక్రవర్తి, మాదాసు గంగాధరం తదితరులు


సైదాపురం: అంజనేయస్వామిలో హోమంలో పాల్గొన్న భక్తులు


సూళ్లూరుపేట: పూజ చేస్తున్న అర్చకులు

శోభాయాత్ర, బైక్ ర్యాలీ

సూళ్లూరుపేట: హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట పట్టణంలో శోభాయాత్ర, మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభించిన ఈ శోభాయాత్ర, బైక్ ర్యాలీని బీజేపీ నాయకులు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, మురళీరెడ్డి పచ్చజెండా వూపి ప్రారంభించారు. సుమారు 300 మంది ర్యాలీకి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి మురళీరెడ్డి, మిట్ట కమ్మిరెడ్డి, సుంకర ప్రతిమ, గోపీ, దేవేందర్‌రెడ్డి, శ్రీధర్, శ్రీనివాసులు, ఉషా, నారాయణరెడ్డి, రామకృష్ణ, సన్నీ, వసుంధర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సూళ్లూరుపేట: హనుమంతుని శోభాయాత్ర

మల్లాం ఆలయాభివృద్ధికి కృషి

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి అలయాభివృద్ధికి కృషి చేస్తానని శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సుబ్రమణ్యేశ్వరస్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నిత్యాన్నదాన నూతన భవన నిర్మాణం, కోనేరు పనులను పరిశీలించారు. ఆలయంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో జరిగే అన్నదాన కార్యక్రమానికి రూ.1.5 లక్షలు విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ చిల్లకూరు కోదండరామిరెడ్డి తనను కలసి అలయానికి రావాలని, ఆలయాభివృద్ధికి సహకరించాలని కోరారన్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు దేవాదాయ శాఖాధికారులతో మాట్లాడి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు తన వంతు సహాయసహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం ఆయనకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామి, అమ్మవారి చిత్రపటం అందజేసి, శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు లింగారెడ్డి చంద్రారెడ్డి, వాకాటి వేణురెడ్డి, గోపాల్‌రెడ్డి, మేరిగల మధుయాదవ్, ఎల్లూరు ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు చిల్లకూరు చిన్న జయరామిరెడ్డి, పాపారెడ్డి వెంకటసుబ్బారెడ్డి, చిల్లకూరు వేణురెడ్డి, మాచిరెడ్డి సుబ్బారెడ్డి, చిల్లకూరు కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.


రవి సన్నారెడ్డికి స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ చైర్మన్ సాయికుమార్‌రెడ్డి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే అజెండా

పెళ్లకూరు: రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రధాన అజెండాగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం పెన్నేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎన్ని అవరోధాలు ఎదురైనా పేదల అభ్యున్నతే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కుల, మత, రాజకీయ బేధాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు నేరుగా అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు, పవన్‌లను రాష్ట్ర ప్రజలు పట్టించుకోవడం లేదని, వాళ్లు చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సర్పంచ్ కుదిరి లక్ష్మి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, పార్టీ నేతలు మధుసూదన్‌రెడ్డి, సుధాకర్, సోమశేఖర్‌రెడ్డి, చైతన్యకృష్ణారెడ్డి, రఘునాయుడు, చక్రపాణి, సురేష్‌రెడ్డి, అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పెన్నేపల్లికు చెందిన అవరంబేటి ప్రసాద్(52)కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదివారం పరామర్శించారు. ప్రసాద్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి పంచాయతీ వార్డు సభ్యురాలు, అలాగే అతని కుమారుడు విశ్వతేజ వలంటీరుగా సేవలు అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవయ్య బాధితుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.


సంక్షేమ ఫలాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

నాయుడుపేటటౌన్: పట్టణంలోని చంద్రబాబు కాలనీలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సంస్థ అధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సాయి శ్రీనివాస ప్రజా వైద్యశాల సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు వినూప్‌కుమార్ చల్లా, ఎం స్వర్ణసుధ పాల్గొని, రోగులకు పరీక్షలు చేశారు. చంద్రబాబు కాలనీతోపాటు మహాలక్ష్మమ్మ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన 75 మందికి పైగా పాల్గొని, పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సంస్థ ప్రతినిధులు హఫీజ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

17న ఉచిత కంటి వైద్య శిబిరం

నాయుడుపేట మండలంలోని ఎంపీ చక్కెర పరిశ్రమ సమీపంలో ఉన్న భగవతి మల్లికాంబ అమ్మవారి ఆలయం వద్ద ఈ నెల 17 తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అమాస రామనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ వైద్యుల సౌజన్యంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు వరకు శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లను కచ్చితంగా తీసుకుని రావాలన్నారు. పరీక్షలు చేసి, అవసరమైన వారికి చెన్నైలోని శంకర్ నేత్రాలయలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు.


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముత్యాలమ్మ ఆలయంలో పోటెత్తిన భక్తులు


ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ

చిల్లకూరు: తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరు లో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవి సెలవుల కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో ఆ ప్రాంతం జాతరను తలపించింది. అమ్మవారికి భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు. నూతన జంటలు ఆలయంలోని రావి చెట్టు వద్ద ఊయలలు కట్టి మొక్కుకున్నారు. త్రిశూలం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ఉదయం అమ్మవారికి పలు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఇంద్రసేనమ్మ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పల్ ఎస్ ఉమారాణి తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్, టర్నర్, వెల్డర్ ట్రేడ్‌లలో చేరడానికి ఆసక్తి కలిగిన పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని తమ ఒరిజనల్ సర్టిఫికెట్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ప్రభుత్వ ఐటీఐలో జూన్ 6వ తేదీ సాయంత్రం 5.00 గంటల్లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఇంకా పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ఒక సంవత్సరం ట్రేడ్ కోర్సుల్లో చేరడానికి అర్హులని చెప్పారు. వివరాలకు 98664 20415, 94418 50595 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కండలేరులో 34.146 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటి కి 34.146 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 2,450 క్యూసెక్కులు, పిన్నెరు వాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు 180, హైలెవల్ స్లూయిస్‌కు 15 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

ఘనంగా రాజమునీశ్వర స్వామి వార్షికోత్సవం


ఎల్లూరులో అన్నదానం చేస్తున్న దాతలు

చిట్టమూరు: ఎల్లూరులో రాజమునీశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారికి విశేషాలంకరణ చేసి, గ్రామోత్సవం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ నెల్లూరు జిల్లా చైర్మన్ మల్లెం విమలమ్మ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నేడు ఇనుగుంటలో గడపగడపకు మన ప్రభుత్వం

ఓజిలి: మండలంలోని ఇనుగుంటలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు గుంటమడుగు రవీంద్రరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం


ర్యాలీ చేస్తున్న అటవీ సిబ్బంది

సైదాపురం: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని అటవీ అధికారి గిరిజాకుమారి పిలుపునిచ్చారు. సైదాపురంలో ఆదివారం పర్యావరణహిత జీవన శైలిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవుల మునుగడకు ముప్పు వాటిల్లకుండా ఉండేలా ప్రతి ఒక్కరూ చెట్లను కాపాడుకోవాలన్నారు. ప్రతి ఇంట విరివిగా మొక్కలను పెంచుకోవాలన్నారు. అలాగే అడవులను సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది భాను తేజ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య ప్రదర్శనకే 'హ్యాకథాన్'


హ్యాక్‌థాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

గూడూరురూరల్ : విద్యార్థులు నేర్చుకున్న టెక్నాలజీ నైపుణ్యాలను ప్రదర్శించేందుకే 24 గంటల హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మోహన్ తెలిపారు. ఆదివారం పట్టణ సమీపంలోని ఆదిశంకర కళాశాలలో నిర్వహించిన హ్యాకథాన్‌లో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మోహన్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటల వరకు ఈ కార్యక్రమం నిరంతరాయంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ధనుంజయ, వేణుమాధవ్, ఏఓ రామయ్య పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

వెంకటగిరిరూరల్: గడ్డివామి ప్రమాదశాత్తు దగ్ధమైన ఘటన మండలంలోని గొట్లగుంటలో ఆదివారం చోటుచేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి ఆదినారాయణ కథనం మేరకు.. గొట్లగుంట గ్రామానికి చెందిన తోట ముద్దుకృష్ణయ్య అనే రైతు సుమారు 15 ఎకరాలు గడ్డిని వామిగా వేసుకున్నారు. ప్రమాదవశాత్తు వామికి నిప్పంటుకోవడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గడ్డివామికి నిప్పంటుకుని ఉండవచ్చని భావిస్తున్నట్లు అగ్నిమాపక శాఖాధికారి తెలిపారు. ఈ ఘటనలో బాధితునికి రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

దొరవారిసత్రం: కుప్పారెడ్డిపాళెం సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం ఆగి ఉన్న లారీని అటుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణించే ఇద్దరు మహిళలు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వెంకటగిరి నుంచి చెన్నైకు వెళుతున్న కారు అదుపుతప్పి కుప్పారెడ్డిపాళెం సమీపంలో రహదారిపై ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణించే ఇద్దరు మహిళలకు స్వల్ప గాయాలు కాగా కారు ముందుగా భాగం నుజ్జు నుజ్జు అయింది. ఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ తిరుమలరావు పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.